స్వయంకృతాపరాధమా!

(వెనుకటి సంచిక తరువాయి)

[చిత్తరంజన్ గనులలో నధికారి. ఉత్తముఁడు. ఉత్తమాశయములు గలవాఁడు. ఒకప్పుడు గనిలో ప్రేలుడుసమయమున పైకివచ్చుటకు త్రోవగానక బాధపడుచుండగా, నతని సహోద్యోగియగు బెనర్జీ చిత్తరంజన్ ప్రాణములఁ గాపాడెను. కృతజ్ఞతాపూర్వకముగా 'జీవితమే నీయధీన' మని చిత్తరంజన్ బెనర్జీ సాయమును ప్రశంచెను. కాని యతఁడు మునుపటివలెనే విచిత్రమానవుఁడుగా ప్రవర్తించుచుండి, చిత్తరంజన్ లేనపుఁ డతని వశముననున్న గనుల యధికారి పైకము నపహరించెను. ఇనుపపెట్టె తెరచుమార్గమును చిత్తరంజన్ జోబులోనుండి వ్రాసియుంచుకొనెను. ఆరాత్రి అతఁడు నిద్రించుచున్నపుడు అపహరించిన ధనమును దాచెను. మరుదినము అధికారి యగు బోసు వారిరువురిని అనుమానముచే నిర్బంధించెను. బెనర్జీ ఇనుపపెట్టెను దెరచుటకు వ్రాసియుంచుకొన్న బిల్లు దొరకగా చిత్తరంజన్ తన నిర్దోషత్వమును దెలుపుట కాలోచించుచుండ, బెనర్జీ దానిని గనిపెట్టి, తా నతని ప్రాణముల గాపాడినదానికి చిత్తరంజన్ జీవితమునుండి యొక సంవత్సరకాల మివ్వవలయునని గోరెను. తరువాత కథ జదువుఁడు.]

అతఁ డంత నిట్లు జెప్పదొడఁగెను. "నీవద్దనున్నది వైద్యుఁడు పరీక్షచేసి నాకు మూడవమా రిచ్చినబిల్లు. ఒకపరీక్షచే నేను తృప్తిపొందలేదు. ఏలన నే జీవించు టింకొక సంవత్సరముపైన కొన్నిమాసములు మాత్రమే. దీని నబద్ధమని నిరూపింప నే నెన్నియో మారులు వైద్యులచే పరీక్ష జేయించుకొంటిని. నిరుపయోగమయ్యెను. కావలసిన నిదర్శనములు నీకు జూపింతును."

అతఁడు తన మేజాను తీయ ప్రయత్నించెను; నే వారించితిని. "నే నది నిజమని నమ్మెదను. కాని బెనర్జీ! నీవు నన్ను నమ్మించుటకై నే నిటనుండగా దూరముగనున్న గుట్టలకువెళ్లి మరుగైతివిగదా! అది యట్లుండనిమ్ము. దీనికి ధనాపహరణమునకు సంబంధమేమి" అంటిని.

"ఇదే సంబంధము. నే నింకమీద చాలకాలము పాటుబడజాలను; జీవితాంతమువఱకు యిచట పాటుబడవలయునను యిచ్ఛగూడలేదు. నే మృతినొందుటకు మునుపు జీవించుటెట్టిదో యెఱుఁగవలెను. నే నంతమువఱకు మంచి స్థితియందే యుండనుగాన నా జీవితకాలమంతయు నొక్క సంవత్సరమునందే యిమిడ్చి, నే నింతవఱకు జూడదలంచిన చోటుల నెల్ల దిలకించి చేయదలంచినవెల్ల ముగింపగోరితిని.

"ఇది నా కెంతముఖ్యమో గడచిన నా జీవితమును వినినగాని తెలియదు. నీవు మీ తండ్రిని గురించియు, కర్చుచేసిన పైకమునుగురించియు, [illegible] యితర వస్తువులనుగురించియుఁ జెప్పుకొంటివి గదా! నే నన్ననో దిక్కులేనివాఁడనై అనాథ[illegible]యమువద్ద పేలికలతో విడువబడితిని. [illegible]

ఇప్పటి శరణాలయమువంటిది గాదు. నాకు కడుపు నిండ కూడుగాని కట్ట బట్టగాని చాలినంతలేక, నన్ను గమనించువారులేక నన్నెపుడు ఏడ్పించు మానుషాకృతి దాల్చిన మృగములమధ్య బెరిగితిని. ప్రకృతము నాకు గల్గిన యీవ్యాధికి కారణ మానాటి నిరాదరణయే నని వైద్యులు జెప్పుచున్నారు."

ఇచట నాతఁడు కొంచమాగి యేదియో ఆలోచించురీతి యూరకుండి, తిరిగి తనకుతానే మాట్లాడు లీల నిట్లు ప్రారంభించెను.

"నేను పండ్రెండు సంవత్సరములవాఁడనై యుండినపు డొక రైతింటికి పంపబడితిని. ఆతని యింట నా తిండితీర్థములకై పాటుబడవలసియుండెను. ఆతని పేరు మాధవపాలుఁడు. నా పరిస్థితులు గనుగొని యాతఁడు నన్ను పిండి సారము దీయదలంచి నాకు పనులు జెప్పుచుండెను. నే నెంతపని జేసినను నాకై యాతఁడు వెచ్చించుదాని కది సరిపోదని దలంచుచుండెను. ఆతని భార్య దుర్బలురాలు. అతని కుమార్తెయగు యమున తమ పొలమునం దేమియు పనిచేయ నశక్తురాలై యుండుటచే కుటుంబమునకు తీరని నష్టముగా నెంచబడుచుండెను. కాని ఆమె బాలికలు చేయజాలని పనులు కొన్నిసమయములలో జేయుట గలదు. మైళ్లకొలది దూరముననున్న పాఠశాల కామె పోవుచుండెడిది.

"నేను పదియారు సంవత్సరముల ప్రాయమున నున్నపుడు మాధవపాలుఁడు గతించెను. మాధవపాలుఁడు గతించునప్పటికి ధనమేమియు మిగుల దయ్యెను. అందుచే ఆయన భార్య తనపొలమును ఇంటిని అమ్మి, కూతురకు విద్య నేర్పించుటకై మిద్నపూరునందు నివాస మేర్పరుచుకొనెను.

"వారిని వీడుట నా కతికష్టముగ దోచెను. మాధవపాలునిసతి నను మిగుల యాదరించెడిది. యమునే నే ప్రపంచమున ప్రేమించిన జీవి. అప్పటి కామెకు పదుమూడేళ్ల వయస్సు. ఆ రూపము, ఆ విశాలమైన కనులు, ఆ మృదుత్వము ఎవరికైన నాకర్షించుచుండెను. పోవునపుడామె తల్లి నా కేబదిరూపాయలిచ్చి, కనులనీరు నింపి, 'నాయనా, నీ కెపుడైన అవసరమువచ్చిన వ్రాయుము. తగిన సాయముజేయుదు'నని జెప్పెను. తదనంతరము నేను సమీపమందలి పట్టణము జేరుకొంటిని."

ఇచట గద్గదకంఠుఁడై బెనర్జీ కుర్చీలో కూలఁబడెను. తిరిగి అతికష్టముతో యిట్లు ప్రారంభించెను. "కొన్ని సంవత్సరము లేదోపనిచేసి పొట్టకూటికి సంపాదించుకొంటిని. నా కిరువదియవ వత్సరమున నాజీవిత మింతియే ననుకొంటిని. నా చదువు శరణాలయము విడిచినతోడనే ముగిసియుండెను. యమునమాత్ర మపుడపుడు తన విద్యనుగురించియు, తా నింకను చదువబోవు కళాశాలవిద్యనుగూర్చియు పలుమారు వ్రాయుచుండెడిది. వ్యాకరణయుక్తముగా నాల్గుముక్కలు వ్రాయుటకు నాకు చేతగాకుండుటచే నే నా ఉత్తరములకు జబాబివ్వ సిగ్గుపడుచుంటిని. కాని వ్రాయక యుండజాలనైతిని.

"ఈరీతి అజ్ఞానాంధకారమునఁబడి యా నికృష్ట జీవితమును గడుప నిచ్చగించనైతిని. ప్రత్యేకముగ నైన విద్య నేర్చుకొనదలంచితిని. నే నంతవఱ కేమియు ననుభవింపలేదు. కాని విద్యావంతులై పెద్ద మొత్తముల సంపాదించి సుఖపడుచుండు గౌరవనీయుల సంఘములోనికి జేరుటకై ప్రయత్నింపగోరు నాశ నన్ను విడువదయ్యెను. నా బాల్యకాలమున ధనవంతులపిల్ల లనుభవించునవి గల్గకపోయినను, నా కుమారునికైన యొకప్పు డవి గల్గజేసినచో ధన్యుఁడ నగుదునని యెంచితిని. నా కుమారుఁ డపుడెట్లుండునో యాలోచింపసాగితిని. వానికి గావలసిన వస్తువుల గొనియిచ్చుట, సంతోషపెట్టుట, అతఁడు నా కుమారుఁడని మురియుట—ఇంతకంటె నాకు గావలసిన దేమి. ఏమి? ఇవన్నియు విని నన్ను పిచ్చివానిగా దలంచుచున్నావా?" అని నావంక దిరిగి ప్రశ్నించెను.

స్వయంకృతాపరాధమా!

అప్రయత్నముగ నా నోటినుండి "లేదు. అది పిచ్చితలంపని నే ననుకొనుటలేదు. చెప్పుము" అని వెలువడెను.

"మంచిది. దీని తరువాత చదువనారంభించితిని. చదువుకొరకై నా కర్చులను తగ్గింపవలసి వచ్చినందున చవుకగదికి నివాసముమార్చి, దినభోజన కర్చు గూడ తగ్గించితిని. ఇప్పటికి నాకు కొంచమాశ చేకూరెను. పండుకొను కటికనేలగాని, తిను అరగడుపు భోజనముగాని, దినమంతయు పనిజేసినందున అలయు శరీరస్థితిగాని నాకు దోచలేదు. నేను భావికాలపు తలంపులలో జీవించుచుంటిని. నాకు రానున్న మంచి స్థితిని దలంచుకొనుటే కష్టముగనుండెను. యమునకు వ్రాసితిని. దాని కామె సంతోషముగ బదులు వ్రాసెను.

"ఈ మధ్యకాలములో నొకమారుమాత్రమే యమునను జూడగల్గితిని. అపుడామె కలకత్తాయందుపాధ్యాయినిగాబోవుచు నన్ను మార్గమధ్యమున జూచివెళ్లెను. అపుడామె ఆకారమందును నడవడికయందును ముందుకంటె మనోహరముగనుండెను. నా కృషియంతయు నెప్పటికైనను యమునను వివాహమాడవలయుననెడి యాశపైననే!

"తరువాత నొకసంవత్సరమునకు నా చదువు ముగించి యచట నీ యుద్యోగమున జేరితిని. చేరి యమునకు నా విషయమును వ్రాసి, నాస్థితి కొంత బాగుపడువఱకు వేచియుండి వివాహమాడగలవా యని వ్రాసితిని. ఆమెయిచ్చిన ప్రత్యుత్తరమే నా జీవితములను నిల్పినది. నేఁడదిగూడ నాకు దక్కలేదు."

"ఏమి! ఆమె యిపుడు నిరాకరించినదా?" అని నే నాతురతతోఁ బ్రశ్నించితిని.

విచారముతో నాతఁడు "నాజీవితమున కింకను ఆశగలదేమోయని యున్నదంతయు వెచ్చించితిని. బాల్యమునందు నా పోషణయందు గల్గిన లోపమును, చదువుతోపాటు సంపాదనకై బడిన పరిశ్రమయు నన్నింతకు దెచ్చెనని వైద్యులు ఘంటాపదముగ జెప్పుచున్నారు. ఇది నా దురదృష్టముగదా" యని నవ్వఁదొడగెను.

"నేను తప్పక కొంతకాలమునకు మృతినొందెదనని తెలిసికొంటిని. నే ననుభవింపదలంచిన వెల్లను మిగిలిన కాలములో ననుభవింపదలంచుట నీకిపు డుచితముగా దోచుచున్నదా? నీ వింకను పెక్కుసంవత్సరములు క్షేమముగా జీవింపనున్నాడవు. ఆ జీవితమంతయు నా యధీనమని యనియుంటివిగదా! ఆ జీవితమునం దొక్కసంవత్సరము నాకు దయయుంచి యివ్వఁజాలవా?" అని ప్రార్థనాసూచకముగ జూచెను.

చకితుఁడనై లేచి నిలువబడితిని. ఇంతవఱ కాతని కథయందు లీనమై మాకు రానైయున్న యపాయమును గుర్తెఱుఁగనైతిని.

"బెనర్జీ! నీకు సాయము జేయుదు"నని సానుభూతితో నిండిన హృదయముతో నిట్లంటిని. "నా దగ్గర ఎక్కువగ ధనమున్న యిచ్చియుందునుగాని వేయిరూపాయలుకూడ లేవు. నీ వొకసంవత్సరమని యనుచుండుటవలన నీవు బదులుగా నన్ను శిక్ష ననుభవింపమని నీతలంపైయుండు ననుకొనెదను. శిక్ష ఎన్నిసంవత్సరములు వేయుదురో దెలియదుగదా! అది తలంప వీలులేనిది, నాకది సాధ్యముగాదు."

"ఒకక్షణముండు"మని వారించుచు నాతఁడు తన వ్యూహము వివరించెను. ఆతఁడు ఇనుపపెట్టె దెరచు మార్గము వ్రాసికొన్న సమాచారము నేను దాచినచో నాకు శిక్షగాక తప్పదు. నే నావిధముగ నా నిర్దోషత్వమును నిరూపింప మిక్కుటముగ ప్రయత్నింపనిచో నాకు శిక్ష [illegible]. [illegible] తరువాత తన దోషమును తా [illegible] అధికారులకు వ్రాయును. [illegible]

వాత అది వెల్లడియగును. మృత్యుశయ్యపైనుండి నేరస్థులు తమదోషము లొప్పుకొన్న నిర్దోషుల కెందరికో ముక్తిగలిగినది. నా కా కాలము దుర్భరమైయుండును గాని, ఒక సంవత్సరములో నంతయు ముగియును.

ఇది యాతని వ్యూహము. అది యెఱుఁగాక, అతఁడేమివచ్చినను దాచిన ధనము బైటబెట్టనని వచించెను. ప్రాణమన్న నాతని కొక లెక్కగాదు. ఈ యనారోగ్యస్థితిలో దానిని త్వరగాముగింప పట్టుపట్టుటలో సందేహము లేదు.

నిరాశతో నావైపు జూచుచు బెనర్జీ "నా కెపుడును అదృష్టము పట్టలేదు. అది యిపు డస్తగతమైనది. నీ కెపుడును అదృష్టపు రోజులే. గనిలో ప్రేలుడుగల్గిననాఁడుగూడ నీ కదృష్టము పట్టినది. నేనిపు డింకొక గనిలో నున్నాను. ప్రేలుడు పదార్థము నా క్రిందనున్నది. దానికి నిప్పుగూడ ముట్టింపబడినది. అది యీరాత్రికి ప్రేలుటో ప్రేలకుండుటో నీపై నాధారపడియున్నది" అని ముగించెను.

నిశ్శబ్దముగా నాతనివంక జూచితిని. నిజమే! ఆతను ధనమును దాచినచోటు దెలుపకనే ప్రాణముల వీడగలఁడు. అతని కా నిశ్చయమున్నదనుటలో సందియము లేదు. నే నంగీకరించినను ఆతని దోషమునకు నేను బాధ్యుఁడ గానోపను. 'నా' యనువా రెవరును లేనందున ఆతఁ డడిగినదానికి నే నొప్పుకొన్నను, దానివలన నెవరికిని కష్టము గలుగదు.

ఒకటిగ పట్టుకొనియున్న యాతని బలహీనపు చేతులపై నాదృష్టి బరుగిడెను. ఆ చేతులే గదా నాకును మృత్యువునకును మధ్య యుప్పదిక్షణముల కాలమున్నపుడు నిచ్చెననందించి నన్నపాయమునుండి గాపాడినవి! ఆసమయములో నాతడు నాజీవితములో నొకసంవత్సరకాలము గోరియుండినచో —

"బెనర్జీ! నే నంగీకరించితిని. నీ కోర్కెప్రకారమాచరింతును" అంటిని.

కంఠమును సవరించుకొనుచు నాతఁడు తనముఖమును చేతులతో గప్పుకొనెను.

తేరుకున్న తరువాత బెనర్జీ తన అపరాధమునంతయు నొప్పుకొనుచు నొక ఉత్తరము వ్రాసి దానికి ఇనుపపెట్టె దెరచుమార్గమును వ్రాసియుంచుకొన్న బిల్లును జేర్చి నాకిచ్చెను. నేను దాని నతికించి, సీలు వేసి, దానిపై బెనర్జీ వ్రాసినట్లు "నా యనంతరము శా. చిత్తరంజనునకు" అని వ్రాసితిని.

దీనిని భద్రముగా దాచుట చాల దుర్ఘటము. పోలీసువారు మమ్మిరువురను శోధింతురు. అది యమున హస్తములందుండు వేని మంచిదని యామె నామము సూచించితిని. మొదట బెనర్జీ యంగీకరింపఁడయ్యె గాని, తుద కొప్పుకొని, కలకత్తాయందున్న యమున కొక యుత్తరము వ్రాసెను. దానిలో నాతఁడు నాకు బాకీపడినాడనియు, సీలుజేసిన కవరు నందుండునది బాకీపత్రమనియు, అతనివద్దనుండి రెండు మాసములకాల మెపు డుత్తరములు రాకుండునో, అపు డాకవరును నా చిరునామాకు వెంటనే పంపవలయుననియు వ్రాసెను.

కాని దీనిని పోస్టుచేయుట దుర్ఘటమనిపించెను. అపుడే తపాలు కొనిపోవువాఁడు దూరమున వచ్చుచుండుట కిటికీమూలగున జూచి అతఁడు ద్వారకు ముందు వచ్చుసరికి మావద్దనున్న ఉత్తరము కవరు కొంతపైకము తలుపుక్రిందనుండి బైటికిజరుపగా నాతఁడు దానిని సంతోషముతోఁ దీసికొని వెళ్లెను.

మే మనుకొన్నరీతి నన్ను నిర్బంధమునందుంచిరి. ఇంకపైనవచ్చు నాకథ జెప్పుటకు చాలకష్టము. నే బెనర్జీ యపరాధఫలిత మనుభవించుట కంగీకరించితిని గాని, ఆ హస్తకంకణములు, ఆ చీకటికోణములు, ఆ యమభటులు, ఆ యవమానము ఊహించియుండ లేదు. నాశిక్ష కొంతకాలమే యైనందున భయము లేదు. నాలో నేదియో దీనిని ప్రతిఘటించుచుండెను.

స్వయంకృతాపరాధమా!

నే లొంగలేదు. కారణమేమి? ప్రేలుడు మధ్య నుండి తనప్రాణములను లెక్కింపక నను గాపాడ ప్రయత్నించుటకు బెనర్జీ కెట్టి ధైర్యస్థైర్యము లుండి యుండవలయును! నే నతనిని ఒకసంవత్సరము శిక్ష నుండి గాపాడుటకు నా కట్టి ధైర్యస్థైర్యము లక్కర లేదా? నే నతనికంటె తక్కువ రకమని యనిపించు కొందునా?

న్యాయస్థానమునందు నా యభియోగముపై విచారణ జరిగెను. నే నదివఱకు కలలోగూడ తలంపని విషయములన్నియు నా ప్రవర్తన మంచిదిగాదని నిరూపించుటకు చేకూర్చబడెను. నా ప్రవర్తనవిషయమై యితరుల సదభిప్రాయముల దెచ్చియుందును గాని నా వాగ్దానము ననుసరించి నే నేమియు వాదింప దలంచుకొనలేదు.

నే నెట్టి పొరపాటుగావించితినో యేడు సంవత్సరముల శిక్ష తలపై నిడుకొని కారాగృహము ప్రవేశించినపుడే తెలిసికొంటిని. కాని నిగ్రహమువహించి యుంటిని. ఎంతకఠినముగా గన్పించినను, నేననుభవించు కష్టము ఋణముదీర్చుకొని కృతజ్ఞతజూపుటకే యని ఎంచినపుడు నాలో నొకవిధమగు సంతోషము ధైర్యము పొడచూపెను. ఈ ధైర్యము కడపటివఱకు నను వీడలేదుగాని, సంతోషముమాత్రము చచ్చిపోయెను. కఠినమగు కారాగారనివాసము—అచటి నిర్బంధనలు, సహవాసము అనాదరణ,—అనుభవించిన సంతోష మెన్నఁడో మాయముగాకుండునా? అంతియగాక నాల్గుగోడలమధ్య బంధింపబడుట తలవని తలంపుగా నీశిక్ష యనుభవించుట, మనిషిని మార్చివేయగలవు. నే నావిషయమై యెక్కువబాధ పడలేదు. శిక్షణ నా కనుభవైకవేద్యమే కాని యిట్టిదిగాదు.

ఒక్కొక్కమాసము గడచుచుండ విమోచనము దగ్గరించెనని యెంచుచుంటిని. కాలము జరుగు కొలది నూతనజీవితమున కలవాటుపడి పూర్వసంగతులను గూర్చి విశేషముగా చింతింపమానితిని.

రెండవ సంవత్సర మారంభమయ్యెను. విమోచనము సమీపించినదని యెంచితిని. ఏ నిమిషమైనను నాకు విమోచనము గలుగవచ్చును. ఆతురత భరింపరానిదయ్యెను. మరునెల, లేక రానున్న వారమున, లేక రేపె, మరునిమిషమె నా విముక్తి అను విషయము తప్ప వేరొకటి నే నాలోచించుటలేదు. ఈ ఆలోచనలతో రాత్రులంతయు జాగరమే. మరల నాలుగుమాసములు గడచెను. నా విమోచన మిపుడు తప్పక గల్గవలయును. ఐదవమాసము ఘోరయాతనతోఁ గడచెను. ఆరవమాసముగూడ గతించెను. రెండవ సంవత్సరము ముగియవచ్చెను. ఇపుడు నాకు విమోచనము గల్గునను నాశాజ్యోతి క్రమక్రమముగా క్షీణించి గాఢాంధకారము ప్రబలఁజొచ్చెను. నా విముక్తికై గావించుకొనిన యేర్పాటునందే పొరపాటు గల్గినది.

ఈతలంపు నా మనోవీధిని ప్రత్యక్షమైన రాత్రి నాకు నరకయాతన ప్రారంభమయ్యెను. అంతవరకు నే ననుభవించుచున్నది శిక్ష గాదని యెంచితిని. ఇపుడది నిజమగు శిక్షయైనది—శరీరమంతయు చెమటపోసినది. అనంగీకారసూచకముగా గట్టిగా నరవవలయునని యనిపించెడిది—దుర్భరము. నాది పిచ్చితనము. నేను నిర్దోషిని. నన్ను బంధించు నినుపయూచల చేతులతో నూడబెరికి స్వాతంత్ర్యమునకు న్యాయమునకు దారిజేసికొందును! రాత్రియంతయు నీ వేదనతో మేల్కొనియుంటిని. ఎంతటి తెలివిహీనుఁడనై యంధుఁడనై వర్తించితిని! నా బుద్ధిమాంద్యమునకు నాకే కోపము వచ్చెను. కాని నా విమోచనమునకు గావలసిన యేర్పాట్లన్నియు జేసికొనియేయుంటినే. ఉత్తరము గూడ పోస్టుచేసితినిగదా? ఈవిషయమున పొరపా టెందులకు గలుగును?

బెనర్జీ జీవించియుండగూడదా! ఈతలంపు మనోవీధిని మెరసెను! ఇంకెన్ని సాధ్యములుగావు? అతఁడు తా నపహరించిన ధనమును తన జీవితమును కాపాడునేదేని యొకచికిత్సకై వెచ్చించియుండగూడదా? తరువాతనేమి? యమునకు ప్రతిమాసము ఉత్తరములు వ్రాయుచుండును. అంతయు నిట్లయియుండును. వేరుగా జరిగియుండదు. కోపముచే నా శరీరమంతయు నుడికిపోయెను. బెనర్జీని చూర్ణముగావింప నా హస్తము లాతురతపడుచుండెను. నే నాతని వృత్తాంతమంతయు బైటపెట్టి సాహసించితినిగాని, వానితోఁజేరి యపరాధము జేసినారందురేమోనని విరమించితిని. నే నుత్తమకులసంభూతుఁడను; ఉత్తమాదర్శములగలవానిని. ఆతఁడన్ననో హీనకులజుఁడు. హీనాశయములు గలవాఁడు. అట్టివాని జీవనమును పొడిగించి యాతని దుర్మార్గములకు దోహదము గల్గించితిగదాయని మరల రక్తము వేఁడెక్కెను.

దినములు క్రమక్రమముగా గడచుచుండెను. నా తలంపులన్నియు బెనర్జీపై కేంద్రీకరింపబడియుండెను. ఆతఁ డొకవేళ జీవించియున్నను నేను నిర్దోషినని యెఱింగియు, నన్నింతబాధ ననుభవింపజేసి జీవింప హక్కు గల్గియుండెనా? అప్పటి కిది రెండవ దొంగతనముగాదా? అదియును బలవంతముగ నా సుఖజీవితము అపహరించెనుగదా!

చావలేదుగాన జీవించుచుంటిని. నే విద్యావంతుఁడనైనందున ఐదవ సంవత్సరము నాకు కారాగార కార్యాలయమం దొక యుద్యోగిగాచేసిరి. నాకు కొంచము శాంతి యేర్పడెను. ఐననేమి? బైటిప్రపంచము నా దృష్టినుండి మరిగిపోయినది. బెనర్జీపైన యాగ్రహముమాత్రము దినదినాభివృద్ధి గాంచుచుండెను. నా సత్ప్రవర్తనచే నాకు త్వరగా విముక్తి గలుగునని దెలియును. వెంటనే బెనర్జీచేతను వడ్డీతో గూడ తీర్పవలయును. కాని నా కతఁడగపడునా? కాకేమి? ఎచటదాగినను పట్టుకొనకమానను. ముందు బ్యాంకిలోనున్న వేయిరూపాయలును, నూతనముగా నేర్చుకొన్న చేతిపనులును నాకు సాయపడును. తరువాత! ఆతని మెడ నా చేతులమధ్య నలిగిపోవలసినదే!!

ఏడవ సంవత్సరారంభమున నాకు విడుదలయయ్యెను. వెంటనే యమున ఉపాధ్యాయినిగానున్న కలకత్తాకు ప్రయాణమైతిని. ప్రపంచము, ప్రకృతి, మానవులు నాకు చిత్రముగ దోచెను. సంవత్సరములుగా యంత్రమువలె యాజ్ఞలప్రకారము వర్తించుచుండిన నేను సజీవమగు ప్రపంచములో స్వాతంత్ర్యముతో సంచరించుటను ప్రారంభించినపు డెట్లుండునో వర్ణింపఁజాలను.

యమున ఆచోటు విడిచి సంవత్సరములు గావచ్చినట్లచటి వ్రాతలు జూపుచుండెను. అచటి పాఠశాలాధికారిని విచారింప నాతడు యమున 1927వ సంవత్సరమున బెనర్జీ యను యువకుని వివాహమాడి ఆచోటును వీడెనని వచించెను.

నా మనోభావముల నతికష్టముతో దాచితిని. నరకయాతన ననుభవించి యతనికి ధనము దక్కునట్లు జేయగా వారిరువు రిట్లు సౌఖ్యమనుభవించుచు, దన్నా నరకకూపమునందే వీడిరా! ఎంత నీచులు! నే నెంత తెలివిహీనుఁడను!!

ఆ పాఠశాలాధికారి తదుపరి యమున సమాచారము తన కేమియు తెలియలేదనియు, ఆమె వివాహానంతరము పాట్నాకు తన భర్త ఆరోగ్యమునకై వెళ్లునట్లు జెప్పినరీతి జ్ఞాపకమున్నదనియు, అచట కామె యుద్యోగమునకొఱ కొకరికి సిఫారసుగూడ జేసియుండెననియుఁ జెప్పెను.

కోపముతో శరీరమంతయు వణకుచుండ వెంటనే పాట్నాకు బైలుదేరితిని. ఆదినమే పాట్నా జేరుకొని యొక హోటలునందు బసచేసితిని. సామానుగూడ విప్పకనే యమునను వెదుక బైలుదేరితిని. ఏలాఁ

స్వయంకృతాపరాధమా !

అచట జేరినతరువాత యేమిజరుగునో నే నెఱుంగు దును. నా సామానుతోగూడ నన్ను పోలీసువారు నా స్వస్థానమునకు బంపుదురు. కావున మాటవిప్పిన మరల గట్టుకొనవలయును గదా !

టెలిఫోనుపుస్తకమం దతనిపేరు గలదేమోయని వెదకితిని. ఆశ్చర్యము ! నా కది దొరికెను. 45, బాగ్‌బజారు! ఒక కుఱ్ఱవాని సాయమున ఆ యిల్లును గన్గొంటిని. అది నా బసకు చాలసమీపముననే యుండెను.

నే నాయింటిని సమీపింప వేయు ప్రతియడుగుతో గూడ ఉద్రేక మధికముగాజొచ్చెను. ఇంటిని జేరితిని. అది యంత పెద్ద యిల్లుగాదు. ద్వారము జేరి తలుపుతట్టితిని. నాకు రక్త ముడుకుచుండెను. లోపల పదముల చప్పుడు. ద్వారము తెరచుకొనెను. సుమా రారు సంవత్సరముల బాలుడు నన్ను తదేక దీక్షతో జూచుచు వాకిట నిలువంబడెను.

“బెనర్జీఉన్నాడా?”అని ఆతురతతో యడిగితిని.

“అవునండి” అని సిగ్గుతో నతడు ముఖమువంచి జబాబిచ్చెను.

పైకుబుకుచున్న కోపావేశము నతికష్టముతో నణచు కొని “నే నతనితో మాట్లాడవలె” నంటిని.

ఆశ్చర్యమును ప్రకటించు దృష్టులతో నావంక జూచుచు, “ఎందుకండీ ! నేనే బెనర్జీని” అని యాతడు నింతగా బలికెను.

నే నెంత నిగ్రహము జూపదలంచినను, “ఏమీ! నీవా బెనర్జీవి” అను మాటలు నోటినుండి వెలువడెను.

“బెనర్జీ! వారెవరు” అనుచు నొకస్త్రీ తలుపు పూర్తిగా దెరిచి వాకిట నిలువబడెను. ఆకనులు— ఆముఖము—నాకు ఆమె యమునయని చెప్పక జెప్పుచుండెను.

అంత టామె “బెనర్జీతో మాటలాడ దలంచిన లోపలకురారా”అని ప్రార్థనపూర్వకముగ నడిగెను.

మంత్రముగ్ధుడనై లోపలి కరిగితిని. లోపల గృహ మందలి యేర్పాటులన్నియుఁ జక్కగనుండెను. నే నాసీనుడనై, “అమ్మా, నే మాట్లాడదలంచుకొన్న వారు మీ భర్తయైయుందురని తలంచుచున్నా”నని నస్పష్టముగ నంటిని.

ఆమె ముఖము వివర్ణమయ్యెను. తన దృష్టి నచటనున్న తన కుమరునిపై నిల్పి, “అమరనాథబెనర్జీ (తన కుమారుడు) నాలుగుమాసముల శిశువైయున్న పుడే నా భర్త గతించెను” అని విచారముగ ప్రత్యు త్తరమిచ్చెను. కొంతవఱ కెవరేమియు మాట్లాడ లేదు. నేనుమాత్ర మగాధమునబడిన ట్లూహించితిని.

“నా పేరు చిత్తరంజన్. ఇదివఱ కెపుడైన విన్నారా? మీభర్త నా కేదైనపత్ర మిచ్చిపోయి నాడా” అని తిరుగ ప్రశ్నించితిని.

“ఔ”నని జెప్పి నాకు దానిని తీసికొనివచ్చుటకు వెళ్లెను. కొన్నినిముషములలో దానిని దెచ్చి, “నా భర్త మా వివాహమునకు కొన్ని వారములకు ముందు నా కీ కవరుపంపి, అందున్నది మీకు వ్రాసియిచ్చిన బాకీపత్రమనియు, తన యనంతరము దానిని మీకు పంపవలయుననియు వ్రాసెను. ఆతడు స్వర్గస్థుడగు టకు పదిదినములకు ముందు నాతో మీరు ముందు చోటు వీడి యెక్కడికో వెళ్లినారనియు, వచ్చువఱకు యీపత్రము నావద్దనే యుంచుకొని మీ కివ్వవలసినదనియు జెప్పి యీ యుత్తరముకూడ యిచ్చెను. మీ రీ యుత్తరము జదివి మీ కది తృప్తి కరముగనున్నదేమో యెఱుంగగోరెదను. ఏలన నే నిపుడు పెద్దఋణభారమును వహింపజాలను. అట్లు జేసిన నా పుత్రునిజీవిత మధోగతిజెందును” అని ఆ యుత్తరమును కవరును నాకిచ్చెను.

నా కొక పెట్టినవ్వు వచ్చెనుగాని, దాని నాపు కొని నాబసకు తిరిగివచ్చితిని. అచట సీలుజేయబడిన కవరు జింపిచూడ బెనర్జీ తన యపరాధము నొప్పు కొనుచు వ్రాసిన ఉత్తరము మునుపున్నట్లేయుండెను. తరువాత నాతని యుత్తరము దీసితిని.

అందలి సంగతు లివి. విడువడినవెంటనే యాతడు యమునకు జెప్పి ప్రపంచయాత్ర జేయదలంచుకొని యామెయొద్ద సెలవుగైకొన వెళ్లెను. ఆతనిస్థితి నామె విలోకించి, యతని యవసానకాలమువఱకు నతని సేవజేయ నంగీకరించుటకును, నతని [illegible]

జ్ఞాపకముంచుకొనుట కొకమార్గమును గల్గించుకొనుటకును ప్రార్థించెను. దానివలన నామెకుకలుగు కష్టము లాతఁ డెఱిఁగియు తన జీవితములో ప్రతిక్షణము వాంఛించినదగుటచే నామెను వివాహమాడెను. కాని పుత్రోదయమగునని దెలిసిన పిదప నాతని స్థితి మారిపోయెను. అతఁ డడిగినపుడు నే నెందులకా సంవత్సరకాలమివ్వ నిరాకరింపనైతినని యాతఁడు చింతించెను. క్రమక్రమముగ నాతని కవసానదశ దగ్గరించుచుండెను. తన యపరాధఫలితము తనకుమరునిపై బడునుగదా!

యమునవద్దగల ఒప్పుదల ఉత్తరమును చింపివేయ దలచెను గాని యమున నీచస్వభావములకు లొంగునది గాదు. అది యప్పుపత్రమనికదా యామెకు జెప్పబడినది. ఇప్పు డప్పుదీర్చినట్లు సాక్ష్యముజూపని దామె దానిని చింపనివ్వదు. సత్యము జెప్పుటకు బెనర్జీకి ధైర్యముచాలదు.

పుత్రుఁ డుదయించెను. అతనికి శిక్ష పూర్తియయ్యెను. ఏ పుత్రునికై ప్రపంచములో సర్వసౌఖ్యములు గలిగింప నువ్విళ్లూరుచుండెనో ఆతని కిపు డిచ్చుట కేమియులేకపోగా, పైగా తండ్రి జేసిన యపరాధకళంకము మాత్రము మిగిలినది. కర్తవ్యమేమి?

తన వాగ్దానము తప్పుట విశ్వాసఘాతకమనియు ఘోరపాపమనియు నతనికి దెలియును. కావున పుత్రుని కీప్రపంచమున గావలసినంత ధనమైన నిచ్చి వాగ్దానము నెరవేర్తమని తిరిగి రాగిగనుల కాతఁడు ప్రయాణమయ్యెను. ఏలన తాను దొంగిలించిన ధనములో కొంతమాత్రము దీసికొని మిగిలినదంతయు నచటనే దాచివెళ్లియుండెను. ఇపుడు తన శరీరపరిస్థితియైనను జూడ కచటికివెళ్లి దాచిన ధనముకై వెదకగా నది యెవరో కనిపెట్టి దొంగిలించియుండిరి! ఇక ఆతనిస్థితి వర్ణనాతీతము. అపు డతఁడు తన వాగ్దానము చెల్లింప బూనుకొన్నచో పుత్రునిగతి దుర్భరమగును. తనతోగూడ తన సంసారము కూలిపోవును. కావున నాకష్టము, నాశిక్ష, నాయాతనకంటె యతని శిశువును గాపాడుటే ముఖ్యమని యాతఁడు దలంచెను.

ఏడు సంవత్సరముల తరువాత నతని భార్యాపుత్రుని జూచినపు డేమిజేయుదునో యతఁడు దలంపలేదు. కాని యాతని తుదిప్రార్థన యిది, నే నత్యంత దయాపరుఁడనై యాతనికి సాయముజేయ, నాతనికి బదులుగా శిక్ష ననుభవింపపూనుకొన్న అంగీకారమే బాలుని జీవితమున కాధారము. అట్టివానిని తండ్రి జేసిన తప్పులకై హానిజేయక మన్నింపవలయును.

ఉత్తరము నాచేతులనుండి క్రిందబడిపోయెను. నే నట్లే యచ టెంతసేపు కూర్చొనియుంటినో దెలియదు. నే నేడు సంవత్సరములక్రింద గావించిన తీర్మానమింతకు దెచ్చినది. నేను బెనర్జీకి నాజీవితమున నొక సంవత్సరకాల మిచ్చుట కంగీకరించినపుడే అతఁడు జేయువాని కన్నిటికి బాధ్యత వహించినవానినైతిని. దానికి తరువాత నే నెంత పశ్చాత్తాపమైనను బొందవచ్చును. బెనర్జీ నీచుఁడైన గావచ్చును. తాను బైటనున్నకాలము నా సాయములేక తా నేపనియైన గావించియుండగలఁడా! నిజమే, అతనివలన నే కలలో గూడ తలంపని కష్టములఁబడితిని. నాజీవితము ధ్వంసము జేసికొంటిని. కాని యిదంతయు స్వయంకృతాపరాధమే గదా!

ప్రశాంతుఁడనై లేచితిని. నే నింక యాతని యపరాధమును బైటపెట్టజాలను. దానికి సందేహములేదు. నా తెలివితక్కువవలన గలిగిన పాపము నారేండ్ల చిరుతనిపై బడుచుండ జూడజాలను. నే గావించిన దాని కాతఁడు బాధ్యుఁడుగాడు గాని, ఆతఁ డీప్రపంచములోనికి వచ్చుటకు నేనుగూడ కొంచము బాధ్యత వహించియుంటిని. నే నతని కొకవిచిత్రమైన తండ్రినైతిని. కావున నాచేతనైనంతవఱ కాతని సుఖపెట్టవలసినది నాబాధ్యత.

ఆతని కా సమాచారము దెలియకయుండవచ్చును. నా కది తెలిసినందున జైలునం దనుభవించినదాని నంతగ గణింపలేదు. ఈతనికిజేయు సహాయ మింకను గొప్పదగు త్యాగమును గోరుచున్నది. ఇది గౌరవనీయమైన త్యాగముగదా!

ఇపుడు నే నొక బీదవానిని. స్వయంకృషిచే పొట్టపోసికొనుచు కాలము గడుపుచున్నాడ. ఇపుడు జీవితము నాది; స్వాతంత్ర్యము నాది; యోగ్యత నాది; ఇవియేగదా ఉత్తమమానవుని ఆస్తిపాస్తులు.

(ఒక ఆంగ్లకథ ననుసరించి చ.రా.)